అంతా సక్కగుంటే అడ్డగింతలెందుకు?

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడాది కాలంలో రేవంత్ ప్రభుత్వ సత్తా ఏమిటో ప్రజలకు తెలిసిపోయిందని ఎద్దేవా చేశారు. పోలీసులతో సాగుతున్న పాలన చూసి ప్రజలంతా మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ హయాంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో గురుకులాలను అద్భుతంగా తీర్చిదిద్దితే, రేవంత్ ప్రభుత్వం వాటిని నాశనం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల్లో చదువుతున్న తమ పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళనగా ఉన్నారని పేర్కొన్నారు. ఆదివారం తమ పిల్లలను కలిసేందుకు వెళ్లిన తల్లిదండ్రులకు అనుమతి ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాలను జైళ్లలా మారుస్తున్నారని ఆరోపించారు.

ఈ నిర్బంధాలు ఇంకా ఎంత కాలం?

'లగచర్లకు వెళతామంటే అనుమతి ఇవ్వరు. మహబూబాబాద్‌లో మీటింగ్‌కు అనుమతివ్వరు. ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు, లాఠీచార్జిలు.. ఇంకా ఎన్ని రోజులు ఈ నిర్బంధాలు, ఎంతకాలం ఈ మోసాలు' అని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ పూర్తికాలేదని, దమ్ముంటే దీనిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్ల కొనుగోలుపై లెక్కలు చెప్పడం లేదని, రైతు భరోసా కన్నా బోనస్ బాగుందని చెప్పడానికి మంత్రికి సిగ్గు ఉండాలని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క పోలీసు శాఖకు తప్ప, ఏ శాఖకూ సరైన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో దోచుకుని ఢిల్లీకి మూటలు పంపడం తప్ప ఈ ప్రభుత్వానికి ఏదీ చేతకావడం లేదని ఆరోపించారు. ఏం చేశారని సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఢిల్లీ బానిసలకు అధికారం అప్పజెప్పొద్దని కేసీఆర్ మొత్తుకున్నారు. ఏడాదిలో సీఎం 30 సార్లు ఢిల్లీ వెళ్లారు? ఏం సాధించారు?' అని ప్రశ్నించారు. ఆఖరికి సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ హయాంలో ఎన్‌కౌంటర్లు లేవు

పదేండ్ల కేసీఆర్ పాలనలో పోలీసుల అత్యుత్సాహం వల్ల ఒకే ఒక్క ఎన్‌కౌంటర్ జరిగినట్టు జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఎన్‌కౌంటర్లలో 16 మంది చనిపోయారని తెలిపారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు వస్తే వెంటనే విచారణకు ఆదేశించాలని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నడిపేది బీఆర్ఎస్ అయినట్టు కాంగ్రెస్ నేతలు ప్రతి అంశంలో తమ కుట్ర ఉందని ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. గురుకులాల్లో విషాహారం వెనక బీఆర్ఎస్ కుట్ర అని చెప్పడానికి సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలన్న సోయి లేదు

వివిధ శాఖలకు మంత్రులు లేకపోవడం కూడా ప్రభుత్వ వైఫల్యాలకు ప్రధాన కారణమని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. 'విద్యా శాఖకు మంత్రి లేకపోవడం ఏమిటి? విద్యాశాఖ కీలకమైందన్న సోయి ఈ ప్రభుత్వానికి లేదు. రేవంత్‌రెడ్డికి దేనిపైనా పట్టింపు లేదు. వేరే విషయాలపై ఆయనకు శ్రద్ధ ఉంది. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రే ఉండటం దుర్మార్గం, అత్యంత మూర్ఖత్వం' అని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి మంత్రివర్గ విస్తరణ చేసే దమ్ము లేదని, కనీసం వేరే మంత్రులకు విద్యాశాఖ అప్పగించాలన్న ఇంగితం కూడా లేదని దుమ్మెత్తి పోశారు. ప్రజలు కేంద్రంగా రేవంత్ ప్రభుత్వం పనిచేయడం లేదని విమర్శించారు. తనకిష్టమైతే తప్ప మంత్రులను సీఎం కలవడం లేదని, ఇక అధికారులను ఏం కలుస్తారని ప్రశ్నించారు. కనీసం కోదండరాంకైనా విద్యాశాఖను కేటాయించాలని, లేదంటే తన శత్రువులుగా ఉన్న మంత్రులకైనా ఇవ్వాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

> **గురుకులాల పరిస్థితిపై అధ్యయనం చేస్తే రేవంత్‌రెడ్డికి వచ్చిన ఇబ్బందేంటి? అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వానికి సూచనలు ఇచ్చేందుకే బీఆర్ఎస్ బృందాలు గురుకులాల్లో పర్యటిస్తున్నాయి. మేం ధర్నాలు చేసేందుకో, తరగతులు బహిష్కరించాలని చెప్పేందుకో వెళ్లడం లేదు. సమస్యలు తెలుసుకుందామని మాత్రమే వెళ్తున్నాం. గురుకుల బాట పట్టిన బీఆర్ఎస్ అంటే కాంగ్రెస్‌కు, ముఖ్యమంత్రికి ఎందుకంత భయం. పిల్లలకు సరిగా అన్నం కూడా పెట్టలేని దద్దమ్మ ప్రభుత్వమిది.** -జగదీశ్‌రెడ్డి



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

గురుకులాలను భ్రష్టుపట్టిస్తున్న సర్కార్

- **ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఫైర్**
- **గురుకుల సందర్శనకు వెళ్లిన భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతల అరెస్టు**

నారాయణఖేడ్, డిసెంబర్ 2: మెరుగైన విద్యను అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం వెయ్యికిపైగా గురుకులాలను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని భ్రష్టుపట్టిస్తున్నదని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. గురుకుల బాటలో సోమవారం జూకల్ శివారులోని బీసీ గురుకుల సందర్శనకు వెళ్లిన భూపాల్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాలను ప్రభుత్వం పట్టించుకోనందునే 50 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, వందల మంది విద్యార్థులు కలుషిత ఆహారం, నీటి వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాలను ప్రభుత్వం సక్రమంగా నిర్వహిస్తే తాము సందర్శించాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. విద్యార్థులకు భరోసా కల్పించేందుకు విద్యాలయాలను సందర్శించే ప్రయత్నం చేస్తే ప్రభుత్వం అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు.

గోదావరిఖనిలోని మైనారిటీ పాఠశాల విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చందర్

రాష్ట్రంలో నిర్బంధ పాలన

- **మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**
- **ఖనిలో మైనారిటీ గురుకుల సందర్శన**

గోదావరిఖని, డిసెంబర్ 2: రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగుతున్నదని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని మైనారిటి గురుకుల పాఠశాలను చందర్, బీఆర్ఎస్ నేతలు సందర్శించారు.పాఠశాల సిబ్బంది గేటు వేసి బీఆర్ఎస్ నేతలను లోనికి రాకుండా అడ్డుకున్నారు. అనుమతి లేనిదే లోనికి రాకూడదని చెప్పడంతో అక్కడే వేచి ఉండి విరామ సమయంలో బయటకు వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, విలేకరులతో మాట్లాడారు. గురుకులాల బాటలో భాగంగా విద్యార్థుల స్థితిగతులను తెలుసుకునేందుకు వస్తే పాఠశాల అధికారులు అనుమతి లేదని అంటున్నారని, పోలీసులతో అడ్డుకుంటున్నారని, ఇది దుర్మార్గపు పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

మార్గదర్శకాలు అమలు కాకనే విద్యార్థుల మృతి

మధ్యాహ్న భోజనం వికటించడంపై హైకోర్టులో కొనసాగిన విచారణ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లా వాంకిడిలోని ఆశ్రమ పాఠశాలలో శైలజ అనే విద్యార్థిని చనిపోయిందని, నాగర్‌కర్నూల్‌లో ప్రవీణ్ అనే ఎస్సీ విద్యార్థి కూడా మరణించాడని పిటిషనర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ హైకోర్టుకు వివరించారు. హైకోర్టు గత ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్లే ఈ తరహాలో విద్యార్థులు మరణిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం వికటించి పలువురు విద్యార్థులు దవాఖాన పాలవుతున్నారని అన్నారు. మాగనూరు, కరీంనగర్ జిల్లాలోని మరొక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వికటించిందని చెప్పారు. ఈ అంశాలపై రెండు వేర్వేరు ప్రజాహిత వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. మధ్యాహ్న భోజన పథకం అమలు మార్గదర్శకాలను సరిగ్గా అమలు చేయకపోవడం వల్లే ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని ప్రభాకర్ చెప్పారు. నోడల్ ఏజెన్సీ ద్వారా కాకుండా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు ఘటనలపై మరో కమిటీ వేసిందని అన్నారు. ఈ వ్యవహారాలపై ఇరుపక్షాలు తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

గురుకులాల బాటను అడ్డుకోవడంపై నిరసన

చెన్నూర్/భీమారం/కాగజ్‌నగర్, డిసెంబర్ 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం మంచిర్యాల జిల్లాలో చేపట్టిన గురుకులాల బాటను పోలీసులు, ప్రిన్సిపాళ్లు అడ్డుకోవడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు, గురుకుల పాఠశాల సిబ్బంది అడ్డుకోవడంపై మండిపడ్డారు. మైనార్టీ గురుకుల పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు నయాబ్ మాట్లాడుతూ వసతి గృహాల్లోని వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే పోలీసులు అడుగడుగునా తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భీమారంలోని కేజీబీవీని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ నాయకులతో కలిసి వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. లోపలికి అనుమతించకపోవడంతో అక్కడే బైఠాయించారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని జ్యోతి బాపూలే, గన్నారంలోని జ్యోతిబా పూలే విద్యాలయాలను బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ముస్తాఫా నాయకులతో కలిసి సందర్శించారు. ఆపై సిర్పూర్ (టీ) మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయానికి వెళ్లగా, పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గేటు ఎదుట బైఠాయించారు.

చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



సుబేదారి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు

విద్యార్థులు చనిపోతున్నా పట్టదా?

- **సర్కార్‌పై మాజీ చీఫ్‌విప్ దాస్యం మండిపాటు**
- **గురుకుల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులు అరెస్ట్**

హనుమకొండ, డిసెంబర్ 2 : గురుకులాల్లో ఏడాదిలో పదుల సంఖ్యలో విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. హంటర్‌రోడ్డులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సమస్యలు తెలుసుకొనేందుకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులకు పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న దాస్యం వినయ్‌భాస్కర్ విద్యార్థి సంఘం నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఏసీపీతో మాట్లాడి, విద్యార్థి నాయకులను పోలీస్ స్టేషన్ నుంచి విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేశారని, కానీ, నేడు గురుకులాల్లో ఆహారం నాణ్యత లోపించిందని దుయ్యబట్టారు. కనీస వసతులు కరువై విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

గురుకులంలో స్పృహ తప్పిన విద్యార్థిని

దవాఖానకు తరలించిన బీఆర్ఎస్ నేత రాజారాం

ఇందల్వాయి, డిసెంబర్ 2: గురుకుల పాఠశాలలో స్పృహ కోల్పోయిన ఓ విద్యార్థినిని బీఆర్ఎస్ నేత రాజారాం యాదవ్ దవాఖానకు తరలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం చేసేందుకు వెళ్తూ రాజారాం సోమవారం నిజామాబాద్ జిల్లా తిర్మన్‌పల్లిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలను సందర్శించారు. నీరసంగా ఉన్న ఓ బాలిక ఉన్నట్టుండి స్పృహ కోల్పోయింది. రాజారాం యాదవ్ ఆటో తీసుకొచ్చి ఆమెను ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో గురుకులాల వ్యవస్థ దెబ్బ తిన్నదని ఆరోపించారు.

స్పృహ కోల్పోయిన విద్యార్థినిని ఆటోలో దవాఖానకు పంపిస్తున్న బీఆర్ఎస్ నేత రాజారాం యాదవ్

దిగువకు నీళ్లివ్వలేం!

మొదటిపేజీ తరువాయి...

ఎస్సారెస్పీ స్టేజీ 1, స్టేజీ 2 ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీళ్లు అందాలంటే ప్రస్తుతం పది వేల ఎకరాల చొప్పున కేటాయిస్తున్న ఒక టీఎంసీ జలాలను, ఇక 15 వేల ఎకరాల చొప్పున సర్దాల్సి ఉంటుందని, కేవలం ఆరుతడి పంటలకే సాగునీటిని అందించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం. ఆయా ప్రతిపాదనలపై క్షేత్రస్థాయిలో రైతాంగం నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

మొత్తం 13.33 లక్షల ఎకరాలు

ఎస్సారెస్పీ స్టేజ్-1లో అంటే ఎల్‌ఎండీకి ఎగువన అంటే ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ 0-146 కిలోమీటర్ల ఎల్‌ఎండీ వరకు 4,62,920 ఎకరాలకు, దిగువన అంటే కాకతీయ కెనాల్ 146-284 కి.మీ., వరకు అంటే మైలారం వరకు 5,05,720 ఎకరాలకు మొత్తంగా 9,68,640 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉన్నది. ఎస్సారెస్పీ స్టేజీ-2 అంటే కాకతీయ కాలువ 284 కి.మీ నుంచి 347 కి.మీ వరకు ఉంటుంది. దీని కింద మొత్తం 4.4 లక్షల ప్రతిపాదిత ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం 3.65 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే మేరకే కాలువ పనులు పూర్తయ్యాయి. ఆ మేరకే కొద్దికాలంగా అందిస్తున్నారు. ఎస్సారెస్పీ స్టేజ్-1, స్టేజ్-2 మొత్తం కలుపుకుని 13.33 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఆయకట్టు మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి ప్రతి సీజన్‌లో సాగునీటిని విడుదల చేయడం పరిపాటి. ఎస్సారెస్పీ నుంచి ఎల్‌ఎండీ వరకు జోన్-1గా పిలుస్తుండగా, అందులో డీ-5 నుంచి డీ-94 వరకు కాలువలు వస్తాయి. ఈ ఆయకట్టుకు దాదాపు 40 టీఎంసీల వరకు, ఎల్‌ఎండీ దిగువ నుంచి 284 కి.మీ వరకు జోన్ 2-గా అంటే డీబీఎం-1 నుంచి డీబీఎం-56 వరకు ఉన్న ఆయకట్టుకు దాదాపు 55 టీఎంసీలు, అటు తరువాత డీబీఎం-74 వరకు ఉన్న జోన్-3కి మొత్తంగా 25 టీఎంసీల మేర సాగునీరు అవసరమవుతుంది. ప్రతీ యాసంగిలో ఆయా జోన్లకు 16 తడుల వరకు మొత్తంగా 120 టీఎంసీల మేర జలాలు అవసరం. ప్రస్తుతం ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ, ఎంఎంఆర్‌లో మొత్తంగా 127 టీఎంసీలు ఉన్నాయి. వేసవి తాగునీటి అవసరాలు, ఆవిరి నష్టాలు, డెడ్‌స్టోరేజీ పోతే నికరంగా వినియోగానికి 100 టీఎంసీలు కూడా అందుబాటులో ఉండవని అధికారులు చెప్తున్నారు.

దిగువకు నీరివ్వలేం

ఎస్సారెస్పీ నుంచి ఎల్‌ఎండీ వరకు అంటే జోన్-1 వరకు మాత్రమే ప్రస్తుతం నీరిస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 80 టీఎంసీలు ఉన్నప్పటికీ, అందులో డెడ్‌స్టోరేజీ కింద 5 టీఎంసీలు, మిషన్‌భగీరథ తాగునీటి అవసరాలకు 7 టీఎంసీలు, ఆవిరి నష్టాలు 2 టీఎంసీలు మొత్తంగా 14 టీఎంసీలు పోతే, అందుబాటులో ఉండేది నికరంగా 66 టీఎంసీలు మాత్రమేనని వివరిస్తున్నారు. ఆ జలాల్లోనూ ఎల్‌ఎండీ వరకు 40 టీఎంసీలు, సరస్వతి కెనాల్‌కు 6 టీఎంసీలు, లక్ష్మీ కెనాల్‌కు 3 టీఎంసీలు, అలీసాగర్‌కు 4.50, గుత్పకు 3.5 టీఎంసీలు, చౌటుపల్లి హన్మంతరెడ్డి ఆయకట్టుకు ఒక టీఎంసీ చొప్పున మొత్తంగా 58 టీఎంసీల వరకు అవసరమవుతాయని వివరిస్తున్నారు. ఇవికాకుండా ఆయా కాలువల కింద ట్రాన్స్‌మిషన్ నష్టాలు, రైతులు ఎక్కడికక్కడ నీటిని మధ్యలోనే మోటర్లతో తోడుకోవడం ఉంటుందని, అదనంగా కూడా జలాలను విడుదల చేయాల్సి ఉంటుందని చెప్తున్నారు. ఎల్‌ఎండీకి దిగువకు నీటిని విడుదల చేయలేమని అధికారులు స్పష్టంచేస్తున్నారు.

ఒక టీఎంసీతో 15 వేల ఎకరాలు

ఎస్సారెస్పీ అధికారులు ఎల్‌ఎండీ ఎగువకే నీటిని విడుదల చేస్తామని చెప్పుండటంతో ప్రస్తుతం స్టేజీ-2 ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఎల్‌ఎండీ, ఎంఎంఆర్‌లో కలుపుకుని 47 టీఎంసీలు, ఎల్లంపల్లిలో 20 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా 67 టీఎంసీలు నీటినిల్వలు ఉన్నా, హైదరాబాద్ సహా తాగునీటి, ఆవిరి నష్టాలను మినహాయిస్తే నికరంగా 50 టీఎంసీలు కూడా అందుబుటులో ఉండని పరిస్థితి నెలకొన్నది. ఎల్‌ఎండీ దిగువ ఆయకట్టుకే దాదాపు 53 టీఎంసీలు అవసరమవుతాయని అంచనా. మొత్తంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న జలాలు ఎల్‌ఎండీ దిగువ అంటే స్టేజీ-1 వరకు మాత్రమే అందే పరిస్థితి నెలకొన్నది. స్టేజీ-2 కింద దాదాపు 3.65 లక్షల ఎకరాలకు నీటి కొరత ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఒక టీఎంసీతో 10 వేల ఎకరాల చొప్పున గాకుండా, 15 ఎకరాల చొప్పున సాగునీటిని, అదీ ఆరుతడి పంటలకు అందిస్తే స్టేజీ-2 కూడా సాగునీటిని అందించవచ్చని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం.



నేడు స్టేట్ లెవల్ కమిటీ సమావేశం

యాసంగిలో ప్రాజెక్టుల కింద ఎంత నీటిని విడుదల చేయాలనే అంశంపై రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ మంగళవారం జలసౌధలో సమావేశం కానున్నది. ఆయా ప్రాజెక్టుల్లోని నీటి నిల్వలు, ఆయకట్టు విస్తీర్ణం పరిగణలోనికి తీసుకుని, ఏ ప్రాజెక్టు కింద ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే అంచనాలపై చర్చించనున్నారు. మేజర్, మీడియం, మైనర్ అన్ని కలిపి మొత్తంగా 40 లక్షల ఎకరాల వరకు ఆయకట్టు ఉన్నది. నిరుడు కేవలం 28 లక్షల ఎకరాల వరకు సాగునీటిని అందించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవగా ఏ మేరకు ఆయకట్టుకు నీటిని అందిస్తారో ఈ సమావేశంలో తేలనున్నది. మరోవైపు డిసెంబర్ 15 నుంచి సాగునీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

భారత ప్రభుత్వం
దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ,
డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో స్పోర్ట్స్ కోటా-2024 క్రింద కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఉద్యోగానికి ప్రతిభావంతులైన క్రీడాకారుల నియామకం కొరకు ప్రకటన

పేరా 2లో టేబుల్ ప్రకారం స్పోర్ట్స్ కోటాలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో తాత్కాలిక (పర్మనెంట్ చేయవచ్చును) ప్రాతిపదికన గ్రూప్ ''C''లో నాన్-గెజిటెడ్ మరియు నాన్ మినిస్టిరియల్ కానిస్టేబుల్ ఉద్యోగం (జనరల్ డ్యూటీ) కొరకు 275 ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన భారతీయ పౌరులు (పురుషులు మరియు మహిళలు) నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుచున్నవి. అభ్యర్థుల నుండి దరఖాస్తు ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే అనుమతించబడును. ఇతర దరఖాస్తు విధానాలు అనుమతించబడవు. ఆన్‌లైన్ దరఖాస్తు విధానం 01.12.2024న ఉ.00.01 గం.కు తెరువబడును మరియు 30.12.2024న రా.11.59 గం.కు ముగించబడును.

2. ఖాళీలు:
దిగువ క్రీడలు/ ఆటల డిసిప్లిన్స్‌లో 275 ఖాళీలు:

క్ర.సం.	డిసిప్లిన్	ఖాళీలు	
		పురుషులు	మహిళలు
1	ఆర్చరీ	3	3
2	అథ్లెటిక్స్	13	16
3	బ్యాడ్మింటన్	4	4
4	స్విమ్మింగ్	17	17
5	డైవింగ్	3	3
6	వాటర్ పోలో	1	1
7	బాస్కెట్‌బాల్	4	10
8	బాక్సింగ్	7	5
9	సైక్లింగ్	4	4
10	క్రాస్ కంట్రీ	1	1
11	గుర్రపు స్వారీ	5	5
12	ఫుట్‌బాల్	4	0
13	జిమ్నాస్టిక్స్	6	6
14	హ్యాండ్‌బాల్	2	12
15	హాకీ	4	7
16	ఐస్-స్కీయింగ్	6	0
17	జూడో	2	4
18	కరాటే	3	4
19	వాలీబాల్	4	10
20	వెయిట్ లిఫ్టింగ్	5	3
21	వాటర్ స్పోర్ట్స్	6	6
22	రెజ్లింగ్ (G/R)	4	0
23	రెజ్లింగ్ (F/S)	5	5
24	షూటింగ్	5	3
25	టైక్వాండో	5	6
26	వుషు	4	7
27	ఫెన్సింగ్	0	6
పూర్తి మొత్తం- 275 (పురుషులు-127 మరియు మహిళలు-148)			

పే స్కేల్ మరియు ఇతర అలవెన్సులు: 7వ CPC పే మ్యాట్రిక్స్ లెవల్-3 ప్రకారం రూ.21,700 - 69,100/- మరియు రూల్ ప్రకారం కాలానుగతంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి సముచితమైన ఇతర అలవెన్సులు.

3. ఉద్యోగానికి అర్హతగల నిబంధనలు దిగువ విధంగా:
a) వయస్సు- 01 జనవరి 2025 నాటికి 18 నుండి 23 సంవత్సరాలు (అమలులో ఉన్న రిక్రూట్‌మెంట్ రూల్స్ ప్రకారం సడలింపు)
b) **విద్యార్హతలు-** గుర్తింపుపొందిన బోర్డ్ నుండి మెట్రిక్యులేషన్ లేదా తత్సమానమైనది (30.12.2024 నాటికి).
c) **క్రీడార్హతలు-** ప్రకటన ముగింపు తేదీ నుండి చివరి రెండు సంవత్సరాల కాలవ్యవధిలో, సవివరమైన ప్రకటన (https://rectt.bsf.gov.in)లో పేరా 4(b)లో ఇవ్వబడిన కాంపిటేషన్ యొక్క వివిధ లెవల్‌లో పాల్గొన్న లేదా మెడల్(మెడల్స్) గెలిచిన ఆటగాళ్లు మాత్రమే పరిగణించబడును.
d) **శరీర దారుఢ్యం-**
i. **ఎత్తు:** పురుషులు= 170 Cms మరియు మహిళలు= 157 Cms
ii. **ఛాతి-** (పురుషులు మాత్రమే) 80 CMs (unexpanded). కనీస ఎక్స్‌ప్యాన్షన్- 05 CMs.
iii. బరువు- పురుషులు మరియు మహిళా అభ్యర్థుల కొరకు మెడికల్ స్టాండర్డ్స్ ప్రకారం తగిన ఎత్తు మరియు వయస్సు.
గమనిక- ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఫిజికల్ ప్యారామీటర్స్‌లో సడలింపు.
e) మెడికల్ స్టాండర్డ్స్- కాలానుగతంగా MHA ద్వారా జారీచేయబడిన రివైజ్డ్ మెడికల్ గైడ్‌లైన్స్ ప్రకారం.

4. దరఖాస్తు చేయు విధానం:
ఆన్‌లైన్ దరఖాస్తు విధానం BSF రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్ https://rectt.bsf.gov.inలో 01.12.2024న ఉ.00.01 గం.కు తెరువబడును మరియు 30.12.2024న రా.11.59 గం.కు ముగించబడును. అర్హులైన మరియు ఆసక్తి గల అభ్యర్థులు ఈ BSF రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవలెను.

5. ఎంపిక విధానం:
I. యోగ్యతాప్రమాణాలు/ డాక్యుమెంట్ల తనిఖీ
II. శరీర దారుఢ్య కొలత (PST)
III. పూర్తి వైద్య పరీక్షలు (DME)

గమనిక: ఈవెంట్ వారీగా/ వెయిట్ కేటగిరీ వారీగా ఖాళీల వివరాలు, వివరమైన గైడ్‌లైన్స్ BSF రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్ https://rectt.bsf.gov.inలో లభించును, అయితే ఖాళీలు మార్చబడవచ్చును (పై డిసిప్లిన్స్‌లో పెరగవచ్చును లేదా తగ్గవచ్చును). ఏకారణాలు తెలియజేయకుండా ఈ ప్రకటన ప్రచురణ తర్వాత నియామక ప్రక్రియను మార్పు చేయుటకు మరియు ఏ స్టేజిలోనైనా నియామకాన్ని రద్దు చేయుటకు లేదా వాయిదావేయుటకు BSFకు హక్కు కలదు.

(ప్రమేంద్ర కుమార్)
కమాండెంట్ (Trg/Sports)
HQ DG BSF న్యూఢిల్లీ

CBC19110/11/0076/2425